సాక్షి తిరుపతి

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.57,500

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,136

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.65,600

రిటైల్ వెండి గ్రాము రూ.67.60

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	17
తిరుమల	29	13
చిత్తూరు	33	17
గూడూరు	33	19
నగరి	34	18



బస్టాండ్ నిర్మాణంపై చర్చ

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నిర్మాణ విషయమై ఎంఎస్ రైట్స్ కంపెనీ ప్రతినిధులు, ఆర్టీసీ ఈడీలు, డీపీటీఓ చెంగల్‌రెడ్డి చర్చించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

తిరుపతి రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఆదివారం కూడా చెల్లించవచ్చని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు దినం అయినా బిల్లులు చెల్లించేందుకు వీలుగా మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పరిధిలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన వివిధ నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ యోజన పథకంలో భాగంగా ఎలక్ట్రికల్ డొమస్టిక్ అప్లయన్సెస్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఆటోమోటివ్ సర్వీస్ (టూ అండ్ త్రీ వీలర్), ఆటోమోటివ్ సర్వీస్(ఫోర్ వీలర్) కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు జిల్లాలోని 15 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీయువకులు అర్హులని, ఆసక్తి గల వారు 85000 21856, 77996 79351, 99124 45445 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

28న జాతీయ సైన్స్ దినోత్సవం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 28న సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈఓ వీ.శేఖర్ సంబంధిత ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగున్న శాస్త్రీయ వైఖరులను వెలికితీసి వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు సైన్స్ దినోత్సవం వేదికవ్వాలని చెప్పారు. సైన్సు దినోత్సవంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో ప్రదర్శన, అలాగే వారికి వ్యాసరచన, వక్తృత్వ, సైన్స్ బొమ్మల రంగవల్లులు, సైన్స్ డ్రామా తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

తిరుపతి అర్బన్: రెవెన్యూ పెండింగ్ సమస్యను గడువులోపు పరిష్కరించాలని జేసీ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రీ సర్వే, స్టోన్, ప్లాంటేషన్ వేగవంతం చేయాలన్నారు. అసైన్మెంట్ అగ్రికల్చర్ భూములు, సర్వే నంబర్ల సబ్ డివిజన్, జాయింట్ ఖాతాల, మ్యుటేషన్ల క్లరికల్ పొరపాట్లు గుర్తించి సరిచేయాలని చెప్పారు. సమీక్షలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పులికాట్‌కు మహర్దశ

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- రాయదొరువు వద్ద ముఖద్వారం పూడికతీత
- సాగరమాల కింద రూ.129 కోట్లు మంజూరు
- 2,800 మీటర్లు డ్రెడ్జింగ్ చేసేందుకు ప్రణాళిక
- పనులు పూర్తయితే 50 వేలమంది మత్స్యకారులకు ఉపాధి
- 152 రకాల విదేశీ వలస విహంగాలకు పుష్కలంగా ఆహారం
- ప్రజాసంకల్ప యాత్ర హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్



శ్రీహరికోట సమీపంలోని రాయదొరువు సముద్ర ముఖద్వారం వద్ద సరస్సులో ఇసుకమేటలు (ఫైల్)

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లాలోని పులికాట్ సరస్సుకు మంచిరోజులు వస్తున్నాయి. దశాబ్దాల తర్వాత రాయదొరువు వద్ద సరస్సు ముఖద్వారం పూడికతీత పనులకు మోక్షం కలుగుతోంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సహజసిద్ధంగా ఏర్పడిన అతి సుందరమైన పులికాట్ సరస్సును సంరక్షించుకునేందుకు.. బంగాళాఖాతం నుంచి మన రాష్ట్రం వైపు ఉన్న ముఖద్వారంలో పూడికను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేసింది. సాగరమాల ప్రాజెక్టు కింద కేంద్రం నుంచి రూ.129 కోట్లు సాధించి పనులు చేసేందుకు సిద్ధమైంది. 2,800 మీటర్లు డ్రెడ్జింగ్ చేసేందుకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. ఈ పనులు పూర్తయితే ఆరు మండలాల్లో 50 వేలమంది మత్స్యకారులకు జీవనోపాధి, 152 రకాల విదేశీ వలస విహంగాలకు ఆహారం సమకూరుతుంది.

జీవవైవిధ్య సరస్సు

పులికాట్ సరస్సుకు బంగాళాఖాతం నుంచి తమిళనాడు పరిధిలోని పలవేరికాడ్ వద్ద ఒక ముఖద్వారం, మన రాష్ట్రంలో రాయదొరువు వద్ద మరొక ముఖద్వారం ఉన్నాయి. వర్షాకాలంలో స్వర్ణముఖి, కాళంగి నదులతోపాటు చిన్నాచితక కాలువలనుంచి మంచినీరు సరస్సుకు చేరుతుంది. సముద్రంలో ఆటుపోట్లు వచ్చి అలల ఉధృతి పెరిగినప్పుడు అందులో నుంచి ఉప్పునీరు పులికాట్‌లోకి ప్రవేశిస్తుంది. మంచినీరు, ఉప్పునీరు కలగలిసిన సంగమం కాబట్టి దీన్ని జీవవైవిధ్య సరస్సుగా పర్యావరణవేత్తలు గుర్తించారు. జీవవైవిధ్యాన్ని సంతరించుకున్న రెండో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు అయిన పులికాట్.. ఏటా వేసవికి ముందే ముఖద్వారాలకు అడ్డంగా ఇసుకమేటలు పడి ఎడారిలా మారుతోంది.

మాటలుచెప్పి ..మోసం చేసిన టీడీపీ

టీడీపీ ప్రభుత్వ కాలంలో మత్స్యకారుల ఓట్లకు గాలం వేసి పూడికలు తీయిస్తామని చెప్పి 14 ఏళ్లుగా గడిపేశారే తప్ప ఒక్క ఫైల్ కూడా ముందుకు కదిలించలేదు. 1994 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పటి కేంద్ర ప్రభుత్వాలతో సన్నిహితంగా ఉన్నా పులికాట్ సరస్సు అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. 2018 లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించినప్పుడు అప్పటి పర్యాటకశాఖ మంత్రి పులికాట్ సరస్సు పూడికతీత పనులకు రూ.48 కోట్లు మంజూరు చేశామని చంద్రబాబు చెప్పినట్టుగా ప్రకటించారు. ఈ మాటలు నిజం కాదని తెలిసిన మత్స్యకారులు 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు మద్దతు తెలిపారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత పనులకు నిధులు సాధించారు.

ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాట మేరకు..

పులికాట్‌లో మంచినీళ్లు, ఉప్పునీళ్లు కలగలిసి 45 శాతం సెలైనిటీ కలిగి ఉండడంతో ఇక్కడ మత్స్యసంపద అభివృద్ధి చెందుతుంది. సముద్రంలో నుంచి ఉప్పునీరు రావడం తగ్గిపోవడంతో సెలైనిటీ తగ్గిపోయి మత్స్యసంపద తగ్గిపోతోంది. ఒకప్పుడు సంవత్సరానికి ఏడుటన్నుల నుంచి ఎనిమిది టన్నుల మత్స్యసంపద దొరికేది. నేడు సంవత్సరానికి ఒక్క టన్ను కూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని మత్స్యకారులు ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఈ సమస్య తీరుస్తానని ఆయన వారికి మాటిచ్చారు. ఆ మేరకు పూడికతీత పనులు చేయించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి రూ.129 కోట్లు రాబట్టారు. జగనన్న ఎన్నికలకు ముందు మత్స్యకారులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నిధులు తీసుకురావడంలో పెద్దన్న పాత్ర పోషించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ఈ సమస్యను ప్రస్తావించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కూడా తన వంతుగా మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రయత్నించారు.

నిధులు సాధించామనే తృప్తి ఉంది



పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీతకు నిధులు తీసుకొచ్చినందుకు తృప్తిగా ఉంది. సాగరమాల ప్రాజెక్టు కింద రూ.129 కోట్లు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అభినందనలు. మత్స్యకారుల జీవితాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈ నిధులు మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

మాట నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో నాయుడుపేటలో నిర్వహించిన మత్స్యకారుల సదస్సులో వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీయడం అంటే గడిచిన 50 ఏళ్లలో చరిత్రగా మిగిలిపోతుంది. జగనన్న కూడా చరిత్రలో ఒక మంచి ముఖ్యమంత్రిగా నిలుస్తారు.

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

తమిళనాడు తరహాలో పూడిక తీయబోతున్నందుకు సంతోషం



తమిళనాడు వైపు పల్‌వేరికాడ్ వద్ద ఉన్న సముద్ర ముఖద్వారానికి పూడికతీసే తరహాలోనే ఇక్కడ కూడా పూడిక తీయడానికి సన్నద్ధమవుతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ పనులు పూర్తయితే సరస్సు నిత్యం జలకళతో ఉంటుంది. మా మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతుంది. సరిహద్దు వివాదాలు కూడా సమసిపోతాయి. ముఖద్వారం పూడిక తీయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.129 కోట్లు మంజూరు చేయించి పనులు చేయబోతున్నందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తాం.

– ఆర్.శివాజీ, పులికాట్ జాలర్లసంఘం నాయకుడు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గూడూరు : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తూ..

గూడూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మొదట గూడూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు కల్పించే మౌలిక వసతులు, క్యూలైన్లు తదితర వాటిపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నాలుగు రెవెన్యూ డివిజన్‌లలో 138 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఇందులో ఉపాధ్యాయులకు 101 పోలింగ్ కేంద్రాలు, 37 కేంద్రాలను పట్టభద్రుల కోసం కేటాయించినట్టు చెప్పారు. గూడూరులో ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల్లో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వారివెంట మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, సీఐ హజరత్‌బాబు, సర్వేయర్ రాంకుమార్ ఉన్నారు.

వసతులపై ఆరా

కోట: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కోట బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వసతులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గూడూరు ఆర్డీఓతోపాటు స్థానిక తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ, ఎంఈఓ సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థినికి జన్మదిన శుభాకాంక్షలు

వెంకటగిరి: వెంకటగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల విద్యాబోధన, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు చెందిన దీపిక అనే విద్యార్థినికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శయనోత్సవం..నేత్రపర్వం

ముగిసిన శ్రీకాళహస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాలు



ఏకాంతసేవ మందిరంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి/ తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫాల్గుణ శుద్ధషష్టి శనివారం రాత్రి 9 గంటలకు అమ్మవారి సన్నిధి సమీపంలోని శయన మందిరంలో సామి, అమ్మవార్ల ఏకాంతసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏకాంత సేవతో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గత 13 రోజులుగా మూసివేసిన అమ్మవారి శయన మందిరాన్ని తెరిచి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల శయనోత్సవ మూర్తులను శయన మందిరానికి వేంచేపు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించిన పాన్పుపై ఆశీనులు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు విశేష పూజలు చేసి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా ఆలయం లోపల స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లోని నీటిని బయటకు తీస్తూ..

• విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



త్యాగరాజులురెడ్డి (ఫైల్)

రామచంద్రాపురం: బాత్‌రూమ్‌లోని నీరు బయటకు పోకపోవడంతో ఇనుప కమ్మీతో చెత్తను తీస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగిలి గ్రామానికి చెందిన త్యాగరాజులురెడ్డి (44) అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని అనుప్పల్లి పంచాయతీ, బీరమా కులకండ్రిగలో శనివారం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

త్వరితగతిన శ్రీనివాస సేతు మూడో దశ పనులు



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: శ్రీనివాస సేతు మూడవ దశలో నిర్మాణంలో ఉన్న దాదాపు 6 స్టీల్ గర్డర్లను రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని ఏప్రిల్ 15వ తేదీలోపు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలో శనివారం తిరుపతి మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలితో కలిసి ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ రామానుజ సర్కిల్ నుంచి రేణిగుంట వైపు, తిరుచానూరు మార్కెటింగ్ యార్డ్ వరకు ఉన్న శ్రీనివాస సేతు పనులను మార్చి 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. శ్రీనివాస సేతు పనులు ఇప్పటికే 89 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూడా మే 15వ తేదీ లోపు పూర్తి చేయాలని చెప్పారు. సుబ్బలక్ష్మి సర్కిల్ వద్ద పచ్చదనం పెంపొందించాలన్నారు. ఈ సమావేశంలో జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎఫ్ఏఅండ్ సీఏఓ బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ ఎస్ఈ మోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నూతన కమిటీ



డీపీటీఓకు జిల్లా కమిటీని పరిచయం చేస్తున్న నాయకులు

తిరుపతి అర్బన్: వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని శనివారం ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ముఖ్యసలహాదారు సీబీఎస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, అదనపు ప్రధాన కార్యదర్శి షేక్ హబీబ్ నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.రవిశంకర్, ఉపాధ్యక్షుడిగా పీవీ రెడ్డి, ఏవీ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీవీఆర్ కుమార్, కార్యదర్శిగా జే.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా రాజేంద్ర, సహాయ కార్యదర్శులుగా ఎస్ఎస్‌రాజు, ఏ.రంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఏఆర్ కృష్ణ, ఏ.గంగయ్య, ప్రధాన కార్యదర్శులుగా ఏవీ ముని, వి.గిరిబాబు, కోశాధికారిగా సీఆర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డిని కలిశారు.

శివరాత్రి ఆదాయం రూ.35.75 లక్షలు



సురుటపల్లిలో శ్రీ పళ్లికొండేశ్వరాలయ హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న చైర్మన్, అధికారులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల ద్వారా రూ.35,75,418లు ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. శనివారం ఉదయం దేవదాయ శాఖ తిరుపతి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజశయన ఆధ్వర్యంలో 46 రోజులకు సంబంధించిన హుండీల లెక్కింపు చేపట్టారు. అనంతరం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. ఈఓ రామచంద్రారెడ్డి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.